నేడు ఉచిత వైద్య శిబిరం

మణికొండ: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణికొండ చైతన్య కాలనీలోని డాక్టర్ ప్రభు లైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాలి తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. షుగర్, కిడ్నీ, లివర్, ఎముకలు, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు. మణికొండ మున్సిపల్ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీం ఇండియా ఫీల్డింగ్ కోచ్‌కు ఘన స్వాగతం



శంషాబాద్ రూరల్: టీం ఇండియా క్రికెట్ ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌కుమార్‌కు మంగళవారం రాత్రి స్థానికులు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. భారత క్రికెట్ జట్టు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గెల్చుకోగా.. కోచ్ హైదరాబాద్ చేరుకోవడంతో పెద్దగోల్కొండకు చెందిన నాయకుడు వెంకటేష్‌గౌడ్‌తో పాటు పలువురు యువకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. విక్రమ్‌గౌడ్, నర్సింహా, ప్రభాకర్, వెంకటేష్, సాయి, ఉమేష్ పాల్గొన్నారు.

కాటేదాన్‌లో 'విజిబుల్ పోలీసింగ్'

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాటేదాన్‌లో ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశ్రామికవాడలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ పోలీసుల సహకారంతో వాహనాల తనిఖీలు, కిరాణా షాపులలో నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాలపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ... కాటేదాన్ పారిశ్రామిక వాడలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివసిస్తుంటారన్నారు. ప్రతి ఒక్కరి భద్రత దృష్ట్యా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

సులేమాన్‌నగర్‌లో ఇఫ్తార్

అత్తాపూర్: పండగలను అందరూ సుఖసంతోషాలతో ప్రశాంత వాతావణంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. సులేమాన్‌నగర్ డివిజన్‌లో మహ్మద్ మోసిన్ బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, సబ్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, శ్రీను, వార్డు సభ్యులు మహ్మద్ తాహేర్, మహ్మద్ గౌస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

బండ్లగూడ: హైదర్షాకోట్ సాయిరాం ఎన్‌క్లేవ్‌లో అక్రమంగా రోడ్డును ఆక్రమించి చేపట్టిన పలు నిర్మాణాలను బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారని అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారిణి రాణి మున్సిపల్ సిబ్బందితో కలిసి రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేశారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ... ఇలాంటి నిర్మాణాలు కాలనీలో చాలా ఉన్నాయన్నారు. వాటిని కూడా తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను కోరారు.

చెట్టు పై నుంచి పడి రైతు మృతి

శంషాబాద్ రూరల్: చింత పండు రాల్చడానికి చెట్టుపైకి ఎక్కిన రైతు ప్రమాదవశాత్తు జారిపడి గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్‌గూడ వాసి కుమ్మరి కిష్టయ్య(57) ఈ నెల 11న పొలం వద్ద ఉన్న చింత చెట్టుపైకి ఎక్కి పండు రాల్చుతున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు కొమ్మ విరిగి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతన్ని చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పైడినాయుడు సమాచారం మేరకు... ఉందానగర్ చెరువు ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని చెరువులో పడి ఉన్న వ్యక్తిని ఒడ్డుకు తీసి పరిశీలించారు. సుమారు 50–55 సంవత్సరాల వయస్సు ఉంటుందని శరీరం పూర్తిగా దుర్వాసనతో గుర్తు పట్టడానికి వీలు లేకుండా కుళ్లిపోయి ఉందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుడి సంబంధితులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

రహదారి విస్తరణ ముమ్మరం

- నాలుగు వరుసలుగా రహదారి నిర్మాణం
- తీరనున్న వాహనదారుల కష్టాలు

బస్టాండ్ నుంచి నర్కూడ శివారు వరకు విస్తరణ



నర్కూడ శివారులో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు



శంషాబాద్ రూరల్: రహదారి విస్తరణ పనుల్లో వేగం పుంజుకుంది. శంషాబాద్–షాబాద్ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. బస్టాండ్ నుంచి నర్కూడ శివారు వరకు ఈ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం రాళ్లగూడ–నర్కూడ మధ్యలో పనులు సాగుతున్నాయి. రెండు శాఖల ఆధ్వర్యంలో సుమారు ఆరు కిలోమీటర్ల దూరం వరకు విస్తరణ పనులు చేపట్టారు.

వాహనదారులకు ఊరట..

రహదారి విస్తరణ పనులు పూర్తయితే వాహనదారులకు ఊరట కల్గుతుందనడం నిర్వివాదాంశం. బస్టాండ్ నుంచి నర్కూడ వరకు వాహనాల రాకపోకలు భారీగా పెరిగిపోయాయి. షాబాద్ మండలంలోని హైతాబాద్ వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటుతో ఈ మార్గంలో సరుకు రవాణా వాహనాల రాకపోకలతో పాటు ఇతర వాహనాల సంఖ్య పెరిగిపోయింది. రెండు వరసలుగా ఉన్న రహదారితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నుంచి బయటపడేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య నుంచి వాహనదారులకు కాస్త ఉపశమనం కలగనుంది.

రెండు శాఖల ఆధ్వర్యంలో..

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ రహదారి విస్తరణ కోసం ఆర్అండ్‌బీ, హెచ్ఆర్‌డీసీఎల్ శాఖల నుంచి ప్రతిపాదనలు పంపారు. బస్టాండ్ నుంచి ఒయాసిస్ స్కూలు వరకు 3 కిలోమీటర్ల దూరం రోడ్డు విస్తరణకు రెండు విభాగాలకు రూ. 18 కోట్ల చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. ఒకే పనికి రెండు శాఖలకు నిధులు రావడంతో.. పనులు చేపట్టడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో రహదారి విస్తరణను మరింత దూరం పెంచేలా చర్యలు చేపట్టారు.

- బస్టాండ్ నుంచి ఒయాసిస్ వరకు రూ. 18 కోట్లతో హెచ్ఆర్‌డీసీఎల్ పనులను మొదలుపెట్టింది. ఇక ఒయాసిస్ నుంచి నర్కూడ శివారు వరకు ఆర్అండ్‌బీ శాఖ పనులను చేపట్టింది. ఇందుకోసం మంజూరైన రూ. 18 కోట్ల నిధుల నుంచి కవేలిగూడ వద్ద అర కిలోమీటరు దూరం వరకు సీసీ రోడ్డు నిర్మించారు.

పనుల్లో పురోగతి..

రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. విద్యుత్ స్తంభాలను యుద్ధ ప్రాతిపదికన మార్చుతూ రోడ్డు పనులు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టారు. విస్తరణ పనుల కోసం రాళ్లగూడ నుంచి నర్కూడ వరకు ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో ముందుగా ఈ ప్రాంతంలోనే పనులను కొనసాగిస్తున్నారు. బస్టాండ్ నుంచి రాళ్లగూడ వరకు రోడ్డు విస్తరణ కోసం అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుంది. ఇందుకోసం స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా.. అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.



కాచారం వద్ద ఎంటేరువాగుపై ఉన్న వంతెనపై నుంచి పడిన ట్రాలీ (ఫైల్)

ప్రమాదకరంగా వంతెన..

షాబాద్ మార్గంలో కాచారం శివారులో ఎంటేరు వాగుపై ఉన్న వంతెన ఇరుకుగా మారడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన దెబ్బతినడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి విస్తరణ పనులను రామంజాపూర్ వరకు చేపడితే ట్రాఫిక్ సమస్య పూర్తిగా తొలగిపోతుందనే విషయం అక్షర సత్యం.

ఘనంగా త్రివేణి స్కూల్ వార్షికోత్సవం



సందడి చేస్తున్న చిన్నారులు

మణికొండ: సెక్రటేరియట్ కాలనీలోని త్రివేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం బుధవారం అలకాపూర్ టౌన్‌షిప్‌లోని సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జి.వీరేంద్రచౌదరి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువులతో పాటు అన్ని రంగాలలో రాణించేలా తమ పాఠశాలలో బోధన ఉంటుందన్నారు. ఆట, పాటలతో పాటు సాంస్కృతిక, సాంకేతిక అంశాలలోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యలో రాణించిన విద్యార్థులకు మెమొంటోలను అందించారు. పాఠశాల ఏసీఆర్ఓ నరేష్, ప్రిన్సిపాల్ క్రాంతి, సినీపరిశ్రమకు చెందిన వాసు ఇంటూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల సంరక్షణకు చర్యలు



ప్రభుత్వ స్థలమంటూ ఏర్పాటు చేసిన బోర్డు

బండ్లగూడ: పార్కు స్థలాలు, దేవాలయాల స్థలాలను రక్షించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 8వ డివిజన్‌లోని భవానీ కాలనీలోని పార్కు స్థలం, దేవాలయం స్థలం, వాటర్ ట్యాంకు నిర్మాణ స్థలాన్ని రక్షించాలని స్థానికులు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర సూచనల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి వాణి, రాజేంద్రనగర్ పోలీసుల సహకారంతో సర్వే నెంబర్ 10, 11, 12, 13లలో ఉన్న 1034 గజాల స్థలాన్ని, 600 గజాల దేవాలయానికి సంబంధించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడి అక్కడ ప్రభుత్వ స్థలం అని బోర్డులు ఏర్పాటు చేశారు. త్వరలో పెద్ద స్థాయిలో ఆయా స్థలాల్లో అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు.


అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన వాహనం

అత్తాపూర్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఆరాంఘర్ గూండా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఆరాంఘర్ పిల్లర్ నెంబర్ 241 వద్ద నిఘా చేపట్టిన తనిఖీలో ఆరాంఘర్ ప్రాంతానికి చెందిన మన్తోష్‌కుమార్(21) అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనంలో బియ్యం ఇతర సరుకులను తీసుకొస్తూ పట్టుబడ్డాడు. 40 సంచుల సుమారు 1600 కిలోల రేషన్ బియ్యం, 20 సంచుల గోధుమలు సుమారు 800 కిలోలు తరలిస్తున్నాడన్నారు. తక్కువ రేటుకు ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతరులకు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నాడన్నారు. ఇతడికి ఇద్దరు మధ్యవర్తులు ఉన్నారని వారికి వీటిని అమ్ముతున్నాడన్నారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యం, గోధుమలను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.


తల్లీకూతురు అదృశ్యం



శివకుమారి, లభ్య

శంషాబాద్ రూరల్: తల్లి, కూతురు అదృశ్యమైన ఘటన పాల్మాకుల శివారులో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బబ్లు భాస్కర్ ఐదేళ్ల కిందట కుటుంబంతో వచ్చి పాల్మాకులలోని రాజీవ్ గృహ కల్ప సముదాయంలో నివాసముంటున్నాడు. మేస్త్రీ పని చేసే ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 10న ఇతను పని మీద బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి భార్య శివకుమారి(30), చిన్న కూతురు లభ్య(2) ఇంట్లో కనిపించలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై దూసుకెళ్లిన లారీ



మరణించిన దేవీచరణ్

అత్తాపూర్: నిద్రిస్తున్న వ్యక్తిపై లారీ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మధుర ప్రాంతానికి చెందిన దేవీ చరణ్(42) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మైలార్‌దేవ్‌పల్లిలో తన స్నేహితుడితో కలిసి ఉంటున్నాడు. ఇరువురు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో చెరకు రసం షాపును నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో షాపును మూసి వేసి ఇంటికి వెళ్లాల్సిన దేవీచరణ్ ఇంటికి వెళ్లకుండా పక్కనే ఉన్న సిమెంట్ షాపు రోడ్డు పక్కన నిద్రించాడు. ఈ సమయంలో సిమెంట్ షాపులో లోడుతో వెళ్లున్న లారీ (కేఏ56 6430)ని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి దేవీచరణ్‌పై పోనిచ్చాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ వస్తువులు తయారు చేస్తున్న కేంద్రంపై దాడి

మైలార్‌దేవ్‌పల్లి: నకిలీ నిత్యావసర వస్తువులను తయారు చేసి వాటికి ప్రముఖ కంపెనీల లేబుల్స్ అంటించి వినియోగిస్తున్న కేంద్రంపై రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. వివిధ రకాల కిరాణా వస్తువుల సీజ్ చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడని స్వాధీనం చేసుకున్న మిషనరీ, సామగ్రిని ఎస్‌ఓటీ పోలీసులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీలో వీరేంద్ర ఘెహ్లాట్ గదిని అద్దెకు తీసుకొని అందులో నకిలీ... కల్తీ వస్తువులు ఒరిజినల్ అన్నట్లుగా ప్యాకింగ్ చేసి మార్కెట్‌లో విక్రయాలు కొనసాగిస్తున్నాడు. షాంపూస్, వాషింగ్ పౌండర్, టీ పౌడర్లు వివిధ వినియోగ వస్తువులపై లేబుల్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఈ మేరకు హిందుస్తాన్ యూనిలివర్ కంపెనీ మేనేజర్ ఖలీల్ అహ్మద్ ఎలాంటి అనుమతులు లేకుండా వస్తువులను తయారు చేసి తమ లేబుల్స్‌ను ఉపయోగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. నిందితుడు వీరేంద్ర ఘెహ్లాట్ పరారీలో ఉన్నాడని తెలిపారు. అతడి కోసం గాలిస్తున్నామని వెల్లడించారు. ప్యాకింగ్ మెటీరియల్, స్మాల్ మిషనరీ, మెటీరియల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కాపీ రైట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ ఆరోపించారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఐటీయూ పిలుపు మేరకు అన్ని నియోజకవర్గ ఎమ్మెల్యేలను కలిసి తమ డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడాలని వినతిపత్రం అందించామన్నారు. మార్చి 19న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా చేస్తామన్నారు. రాష్ట్రవాప్తంగా 8 నెలల పెండింగ్‌లో ఉన్న గుడ్ల బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లలికిచ్చే మెనూ చార్జీలు పెంచాలన్నారు. పెండింగ్ బిఅల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 వేల వేతనం అమలు చేయాలన్నారు. ప్రతి స్కూల్‌కు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలన్నారు. అవసరమైన గ్యాస్‌ను సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కాటన్ బట్టల యూనిఫామ్ ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వవద్దు అన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్) ద్వారా బిల్లులు, జీతాలు చెల్లించాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వై.స్వప్న, రమ్య, సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'చిల్డ్రన్ అవుట్‌రీచ్'


ఎంపిక చేసిన మూడు పాఠశాలల విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

శంషాబాద్ రూరల్: పాఠశాల స్థాయి విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడంతో పాటు వారిలో నూతన ఆవిష్కరణలు, శాస్త్రీయ ఆసక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన 'చిల్డ్రన్ అవుట్‌రీచ్' కార్యక్రమం పూర్తి చేసినట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. భారత ప్రభుత్వం, శాస్త్ర, సాంకేతిక శాఖ(డీఎస్‌టీ), ఎన్‌సీఎస్‌టీసీ సౌజన్యంతో వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంపిక చేసిన మూడు ప్రభుత్వ పాఠశాలల్లోని 655 మంది విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. నర్కూడ, శంషాబాద్ బాలికలు, రాజేంద్రనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలను ఎంపిక చేశారు. నాలుగు దశలుగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఫండమెంటల్స్, వెబ్ డెవలప్‌మెంట్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ అంశాలపై సెమినార్లు, ప్రాక్టికల్ ట్రెనింగ్‌తో పాటు ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై బూట్‌క్యాంప్, లైవ్ ల్యాబ్ విజిట్లు, ప్రాజెక్టు డెమోన్‌స్ట్రేషన్లు నిర్వహించారు. 15 మంది నిపుణులైన ట్రైనర్లు, 23 మంది విద్యార్థి ప్రాజెక్టు మెంటర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

హోలీకి భారీ బందోబస్తు



రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో

రాజేంద్రనగర్: హోలీ పండగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో వెల్లడించారు. బుధవారం స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసంతో పాటు హోలీ పండగ వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు. హోలీ రోజున యువకులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ రంగులను వెదజల్లవద్దని సూచించారు. రోడ్లపై వెళ్లే వారిపై రంగులు వేయవద్దన్నారు. తమ తమ బస్తీల్లో రంగులను ఆడుకోవాలన్నారు. ప్రార్థన మందిరాలు, రోడ్లపై రంగులు ఆడవద్దని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసులను సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. కామ దహనం సందర్భంగా బస్తీల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా పండగను శాంతియుత వాతావరణంలో ఆనందంగా నిర్వహించుకోవాలన్నారు. పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తామన్నారు. కామ దహనం, హోలీ సందర్భంగా కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు, ప్రార్థనా మందిరాల వద్ద నిఘా పెంచుతామన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: గంజాయి సేవిస్తూ.. విక్రయిస్తున్న నలుగురిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 300 గ్రాముల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడలోని వైట్ బిల్డింగ్ ప్రాంతంలోని నిర్మానుష ప్రాంతంలో గంజాయి సేవించడంతో పాటు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. పల్లెచెరువు ప్రాంతానికి చెందిన సయ్యద్ అర్షద్(25), లక్ష్మీగూడకు చెందిన మహ్మద్ ఖాజా సోహెల్(25), కోఠికి చెందిన ఎం.డి.సలీమ్(19), రాంనగర్‌కు చెందిన ఎం.డి.అమీర్(19)లు నిర్మానుష ప్రాంతాలను ఎంచుకొని గంజాయి సేవిస్తున్నారన్నారు. అసలే రద్దీగా ఉండే ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న లేబర్‌కు ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లల్లో తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఇందులో 300 గ్రాముల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మక్సూద్ అలీ, ఎస్ఐలు పైడి నాయుడు, చంద్రకాంత్, వెంకటరమణ, గోవర్ధన్, నందు, వంశీ, జంగయ్య, శ్రీనివాస్ తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

నార్సింగి సమగ్రాభివృద్ధికి కృషి

- రూ. వంద కోట్లతో పనులు చేపట్టాలి
- అభివృద్ధిపై చిత్తశుద్ధితో ముందుకు సాగాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నార్సింగి మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రగనర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో ముఖ్య నాయకులు, అధికారులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చోట లింక్ రోడ్లు, స్లిప్ రోడ్లు, అప్రోచ్ రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పలు కాలనీలలో డ్రైనేజీలు, రోడ్లు, పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. మున్సిపాలిటీలో దాదాపు రూ. వంద కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె. వేణుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ టి. కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు జి.అమరేందర్‌రెడ్డి, జి.శివారెడ్డి, లక్ష్మీప్రవళిక, మాజీ సర్పంచ్ ఆర్.నర్సింహా పాల్గొన్నారు.

చేయాల్సిన అభివృద్ధి పనులు ఇవే..

కోకాపేటలో విజేత సూపర్ మార్కెట్ నుంచి రాజపుష్ప అట్రియా రోడ్డును కలుపుతూ రూ. 20 కోట్లతో అప్రోచ్ రోడ్డు నిర్మించాలి.

- నార్సింగి రాయల్ ఫంక్షన్ హాల్ నుంచి నార్సింగి జంక్షన్ వరకు ఉన్న బీటీ రోడ్డును రూ. 11.50 కోట్లతో మరింత వెడల్పు చేయాలని, ఫుట్‌పాత్, డివైడర్‌ల నిర్మాణం.
- రూ. 13 కోట్లతో కోకాపేట సర్కిల్ నుంచి గండిపేట సాయిబాబ దేవాలయం వరకు బీటీ రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్, డివైడర్‌ల నిర్మాణం.
- రూ. 10 కోట్లతో మంచిరేవుల బాలాజీనగర్ మురుగునీరు వెళ్లేలా మెయిన్‌రోడ్డు కల్వర్టు నుంచి మూసీ నది వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం.
- రూ. 8 కోట్లతో నార్సింగి వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం పూర్తి చేయాలి.
- రూ. 5 కోట్లతో నార్సింగి సర్వే నెంబర్–151లో మూడు ఎకరాలలో పార్కును అభివృద్ధి.
- రూ. 1.50 కోట్లతో నార్సింగిలోని ఆవుదూడ జంక్షన్ నిర్మాణం.
- వట్టినాగులపల్లి, ఖానాపూర్‌ల మీదుగా ఉన్న బుల్కాపూర్ నాలా పునరుద్ధరణ.
- మంచిరేవులలో రెండు జంక్షన్‌ల అభివృద్ధి. మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న అన్ని కమ్యూనిటీ హాల పనులు పూర్తి చేసేందుకు చర్యలు.
- నార్సింగి హైట్స్ హైటెన్షన్ వైర్ల కింద మణికొండ రోడ్డుకు లింక్ అయ్యేందుకు వంతెన నిర్మాణం.
- కోకాపేట అల్లు స్టుడియో నుంచి గ్లోబల్ హెడ్జ్ స్కూల్ వరకు రోడ్డు విస్తరణ, డివైడర్ ఏర్పాటు చేయాలి.
- వట్టినాగులపల్లిలో అసంపూర్తిగా మిగిలిపోయిన రేడియల్ రోడ్డును రూ. 12 కోట్లతో పూర్తి చేయాలి.